# జఫర్గడ్‌లో మానవత్వానికి నిదర్శనం

- శోకసంద్రంలో ఉన్న కుటుంబాలకు క్లాస్మేట్స్ అండ





తెలుగు గళం న్యూస్ జఫర్ఘడ్: జనగామ జిల్లా జఫర్ఘడ్ మండలం తిడుగు గ్రామానికి చెందిన తాటికాయల సుధాకర్ ఇటీవల అనారోగ్యంతో కన్నుమూయడం కుటుంబ సభ్యులను తీవ్ర శోకసంద్రంలో ముంచేసింది. అలాగే జఫర్గడ్ గ్రామానికి చెందిన బొమ్మెర సాంబరాజు సతీమణి సంధ్య రోడ్డు ప్రమాదంలో ఆకస్మికంగా మరణించడం ఆ కుటుంబాన్ని తీవ్ర విషాదంలోకి నెట్టింది. ఈ రెండు ఘటనలు స్థానికంగా తీవ్ర విచారాన్ని కలిగించాయి.ఈ నేపథ్యంలో జఫర్గడ్ గ్రామ హైస్కూల్‌లో 2005-2006 విద్యా సంవత్సరంలో చదివిన పూర్వ విద్యార్థులు మానవత్వంతో ముందుకు వచ్చారు. తమ సహాధ్యాయుల ద్వారా సమాచారం తెలుసుకున్న వెంటనే సమావేశమై, బాధిత కుటుంబాలకు అండగా నిలవాలని నిర్ణయించారు.బ్యాచ్ స్నేహితులు స్వచ్ఛందంగా విరాళాలు సేకరించి, తాటికాయల సుధాకర్ కుటుంబానికి రూ.30,000 మరియు బొమ్మెర సాంబరాజు కుటుంబానికి రూ.30,000 చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు.కష్టకాలంలో స్నేహబంధం ఎంత గొప్పదో ఈ సంఘటన మరోసారి చాటిచెప్పింది. పాత స్నేహితులు కలిసి చూపిన ఈ మానవత్వం గ్రామస్థుల ప్రశంసలను అందుకుంది.అవసరమైన సమయంలో తోడుగా నిలబడటం ద్వారా సమాజానికి ఆదర్శంగా నిలిచారు.

## సిపిఎం సత్తుపల్లి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా పాకలపాటి వసంతరావు 4 వర్ధంతి సభ



సత్తుపల్లి,ఆర్ సి,ఫిబ్రవరి22(తెలుగుగళం)న్యూస్:సత్తుపల్లి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం రావి వీరవెంకయ్య భవనంలో అమరజీవి పాకలపాటి వసంతరావు నాలుగో వర్ధంతి ఘనంగా నిర్వహించారు. వసంతరావు చిత్రపటానికి సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జాజిరి శ్రీనివాస్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం సిపిఎం సత్తుపల్లి పట్టణ కార్యదర్శి కోలికపోగు సర్వేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో పాల్గొన్న మరో సిపిఎం జిల్లా కమిటి సభ్యులు మోరంపూడి పాండురంగారావు,రైతు సంఘం నేత రావుల రాజబాబులు మాట్లాడుతూ పాకలపాటి వసంతరావు సత్తుపల్లి పట్టణంలో పార్టీని నిర్మించడంలో కీలకపాత్ర పోషించారని కొనియాడారు. అంతేకాకుండా తను నమ్మిన సిద్ధాంతం కోసం కడ వరకు కృషి చేశారని తెలిపారు. ఆనాడు పాలకవర్గాలకు వ్యతిరేకంగా కష్టజీవులు పక్షాన అనేక ఉద్యమాలు నిర్వహించడంలో కీలక భూమిక పోషించిన వ్యక్తి అని కొని ఆడారు, ఆయన ఆశయ సాధన కోసం పార్టీ శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో:పాకలపాటి మల్లికార్జున్, పాకలపాటి శ్రీనివాసరావు,పాకలపాటి ఝాన్సీ,జాజిరి జ్యోతి, రమేష్,బడేమియా, వెంకటేశ్వరరావు, జిలాని, బెజవాడ లక్ష్మీనారాయణ, వెంకటేశ్వరావు,అలీ తదితరులు పాల్గొన్నారు.


## ఓటు వేసిన ఓటర్లకు మిఠాయిలు పంచిన ప్రభాకర్ రెడ్డి"



సత్తుపల్లి,ఆర్ సి, ఫిబ్రవరి 22 (తెలుగుగళం)న్యూస్: సత్తుపల్లి మున్సిపాలిటీ ఎన్నికలలో 21 వ వార్డ్ కౌన్సిలర్ కాంగ్రెస్ అభ్యర్థి గా మందపాటి ప్రభాకర్ రెడ్డి కు ఓటు వేసి విజయం సాధించి పెట్టిన ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం వార్డులోని గడప,గడపకు ప్రభాకర్ రెడ్డి తన బృందంతో వెళ్ళి ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరిస్తూ ఆశీర్వాదం తీసుకుని ఓటర్లకు స్వీట్స్ పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో: వార్డు కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు మరియు అభిమానులు పాల్గొన్నారు.

# చిన్నారి హత్యకు పాల్పడిన అగ్రకుల ఆధిపత్య దుండగులపైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలి

- కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నందిపాటి మనోహర్ డిమాండ్



తెలుగు గళం న్యూస్, ఖమ్మం పట్టణం/ ఫిబ్రవరి 22, ఖమ్మం జిల్లా : నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మెర జాతరలో కుల దురహంకారంతో ఎస్సీ వర్గానికి చెందిన చిన్నారి ప్రాణాలు తీసిన అగ్రకుల ఆధిపత్య దుండగులపైన ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, కఠినంగా శిక్షించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి నందిపాటి మనోహర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ బాధితులు దళిత కుటుంబానికి చెందినవారని తెలిసినా, కనీస భద్రతా చర్యలు తీసుకోకుండా అధికారుల కనుసన్నల్లోనే అగ్రకులానికి చెందిన దుండగులు అత్యంత దారుణంగా తల్లి కూతుళ్లపై దాడిలో చిన్నారి ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని, దళితుల ప్రాణాలపట్ల పాలక వర్గాల నిర్లక్ష్యానికి ఇది అద్దం పడుతుందని, కులవివక్ష ఇంకా నేటికీ కొనసాగుతుందనే భయంకర వాస్తవానికి ఇది నిదర్శనమని వారు ఆక్షేపించారు. ఈ ఘటన జరిగి రోజులు గడుస్తున్నా, నేటికీ ఒక్క దోషిని కూడా అరెస్ట్ చేయకపోగా, దాడికి గురైన దళితులపైనే పోలీసులు కేసు నమోదు చేయడం దుర్మార్గమన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని, ఇది రాజ్యాంగ ద్రోహం తప్ప మరొకటి కాదని వారు విమర్శించారు. ఈ ఘటనకు పాల్పడిన దోషులపైన వెంటనే ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలని, బాధిత కుటుంబానికి 25 లక్షల రూపాయలు పరిహారం వెంటనే చెల్లించాలని, సంబంధిత పోలీసు, రెవెన్యూ, మున్సిపల్ అధికారులపైన క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, ఈ ఘటనపై న్యాయ విచారణ చేపట్టాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దళితుల ప్రాణాలు చవకగా మారిన ఈ వ్యవస్థపై మౌనంగా ఉండకుండా ప్రజాస్వామిక వాదులు, మేధావులు స్పందించాలని, న్యాయం జరిగే వరకు బాధిత కుటుంబానికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించకపోతే, కెవిపిఎస్ ఆధ్వర్యంలో బాధితుల తరపున పెద్ద ఎత్తున పోరాటం చేపడతామని ప్రభుత్వాన్ని ఆయన హెచ్చరించారు.

# మల్టీ పర్పస్ వర్కర్ విధానం రద్దు

-పెండింగ్ వేతనాల చెల్లింపుకై ఈనెల 25న చలో కలెక్టరేట్

జీపి ఉద్యోగ కార్మికులు సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలి

-రాష్ట్ర ఉపాధ్యక్షులు రాపర్తి రాజు



తెలుగు గళం న్యూస్ జనగామ ఫిబ్రవరి 22: గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ, మల్టీ పర్పస్ వర్కర్ విధానం రద్దు, పెండింగ్ వేతనాల చెల్లింపు తదితర డిమాండ్ల సాధనకై ఈనెల 25వ తేదీన జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఆదివారం తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ ఒ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఆన్లైన్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాపర్తి రాజు మాట్లాడుతూ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడిచినా గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు.రాష్ట్రవ్యాప్తంగా 52,000 మంది పంచాయతీ కార్మికులు గత ఎనిమిది సంవత్సరాలుగా మల్టీ పర్పస్ వర్కర్ విధానం రద్దు కోసం పోరాడుతున్నారని, అయినప్పటికీ ప్రభుత్వాలు స్పందించకపోవడం దారుణమన్నారు.వేతనాలు పెంచకపోవడం, సకాలంలో చెల్లించకపోవడం వల్ల కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.గ్రామ సభల ద్వారా నియమించుకున్న పంచాయతీ కార్మికులను "అధనపు కార్మికులు" పేరుతో వివక్షకు గురిచేస్తూ, గత సంవత్సరం నుండి వేతనాలు నిలిపివేయడం అన్యాయమన్నారు.ఇటీవల గ్రామపంచాయతీ ఎన్నికల అనంతరం కొన్ని గ్రామాల్లో పారిశుద్ధ్య కార్మికులను అక్రమంగా తొలగిస్తామని బెదిరింపులకు పాల్పడుతున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయని ఆరోపించారు.ఆన్లైన్‌లో నమోదు కాని పంచాయతీ కార్మికుల వివరాలను వెంటనే నమోదు చేయాలని జిల్లా అధికార యంత్రాంగాన్ని డిమాండ్ చేశారు. అలాగే పిఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా వంటి సామాజిక భద్రతా సౌకర్యాలను కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈనెల 25న నిర్వహించే "చలో కలెక్టరేట్" కార్యక్రమానికి అన్ని గ్రామ పంచాయతీల నుండి కార్మికులు భారీగా తరలివచ్చి ధర్నాను విజయవంతం చేయాలని రాపర్తి రాజు పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బస్వ రామచంద్రం, జిల్లా సీనియర్ నాయకులు మల్లాచారి, మండలాల అధ్యక్షులు, కార్యదర్శులు పగిడిపల్లి మల్లేష్, ఎన్. యాకన్న, సంగి కర్ణాకర్, టి. యాకూబ్, మహేందర్, ఉమ్మగోని రాజేష్, సత్యనారాయణ, జీడి ఆనందం, రతన్ సింగ్, కే. రాజు, జగన్, ఠాకూర్ వివేక్ సింగ్, కుక్కల సోమన్న, నారోజు రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

## భూపాలపల్లి నియోజకవర్గంలో పలు శుభకార్యాలకు హాజరైన వెన్నంపెల్లి పాపన్న




తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి: భూపాలపల్లి నియోజకవర్గంలో జరిగిన కుటుంబ, సామాజిక వేడుకలకు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెన్నంపెల్లి పాపన్న హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి, గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజలతో మమేకమై వారి సమస్యలు,అభివృద్ధి అంశాలపై ఆరా తీశారు.ముందుగా దుంపిల్లపల్లె గ్రామంకు చెందిన బండి సాంబయ్య కుమార్తె వివాహ వేడుకలో పాల్గొన్న పాపన్న,నూతన దంపతులకు అక్షింతలు వేసి ఆశీర్వదించారు.కుటుంబ సభ్యులను అభినందిస్తూ దాంపత్య జీవితం సుఖసంతోషాలతో నిండాలని ఆకాంక్షించారు.తదుపరి మైలారం గ్రామంలో ఐత నరేష్ నూతన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని గృహాన్ని దర్శించి శుభాకాంక్షలు తెలిపారు. కొత్త ఇల్లు శాంతి, ఐశ్వర్యాలతో కళకళలాడాలని కోరుకున్నారు.ఈ కార్యక్రమాల్లో జిల్లా స్థాయి, మండల స్థాయి నాయకులు పాల్గొన్నారు.జిల్లా కార్యదర్శి జిట్టబోయిన సాంబయ్య, జిల్లా నాయకుడు కాంతాల నారాయణరెడ్డి, రేగొండ మండల అధ్యక్షుడు బండి శ్రీనివాస్, భాగీర్తిపేట గ్రామ బీజేపీ సర్పంచ్ పేరుమాండ్ల శ్రీలత తిరుపతి గౌడ్, దుంపిల్లపల్లి ఉపసర్పంచ్ నిరటి రంజిత్, వార్డు సభ్యులు బండి శారద కిరణ్, జున్నుతుల వరలక్ష్మి రాజు, పేరబోయిన భాస్కర్, బోయిని కొమల భద్రయ్య, మాజీ వార్డు సభ్యులు బండి నర్సయ్య, బండి రవి, సుధాకర్ తదితరులు హాజరయ్యారు.

## స్టేషన్ ఘనపూర్ లో మార్వాడి పాన్ బ్రోకర్‌పై సిపిఎం ఆగ్రహం

-వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్



తెలుగు గళం న్యూస్ స్టేషన్ ఘనపూర్ ఫిబ్రవరి 22: స్టేషన్ ఘనపూర్ లో అధిక వడ్డీలు వసూలు చేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న ఓం గణేష్ మార్వాడి పాన్ బ్రోకర్ యజమానిని వెంటనే అరెస్ట్ చేయాలని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి మునిగెల రమేష్ డిమాండ్ చేశారు.ఆదివారం రోజు పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, చిల్పూర్ మండలానికి చెందిన రైతు గద్ద కుమార్ వ్యవసాయ పెట్టుబడుల కోసం ఘనపూర్ మండల కేంద్రంలోని ఓం గణేష్ జ్యువెలర్స్ వద్ద వెండి, బంగారం 11 నెలలపాటు కుదువ పెట్టుకున్నారని తెలిపారు. అయితే డబ్బులు చెల్లించే సమయంలో నెలలు దాటిపోయాయని సాకుతో 6 శాతం అధిక వడ్డీ చెల్లిస్తేనే ఆభరణాలు ఇస్తానని షాప్ యజమాని బెదిరింపులకు పాల్పడ్డాడని ఆరోపించారు.అంతేకాకుండా, రైతుతో వచ్చిన వారిని కూడా అసభ్యంగా తిట్టి, మర్యాద లేకుండా ప్రవర్తించినట్లు పత్రికల్లో వచ్చిన వార్తలను ప్రస్తావించారు. ఎండనక, వాననక శ్రమించి దేశానికి అన్నం పెట్టే రైతును అవమానించే విధంగా ప్రవర్తించడం ఖండనీయమని అన్నారు.ఈ ఘటనపై సంబంధిత అధికారులు పూర్తి స్థాయిలో విచారణ జరిపి, రైతులను మోసం చేస్తున్న మార్వాడి పాన్ బ్రోకర్ యజమానిపై కఠిన చర్యలు తీసుకుని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. మార్వాడి షాపుల్లో అధిక వడ్డీకి డబ్బులు తీసుకున్న బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని పిలుపునిచ్చారు.ఇప్పటికైనా అధిక వడ్డీలు వసూలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోకపోతే, సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని ప్రజా సంఘాలు, వివిధ రాజకీయ పార్టీలను కలుపుకుని ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు చిలుముల్ల భాస్కర్, తోడెంగల ఐలయ్య, నాయకులు వంగపడ్ల సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

## జెడ్పిహెచ్ఎస్‌లో ఓపెన్ స్కూల్ ఆధ్వర్యంలో బేస్ లైన్ పరీక్షలు నిర్వహణ



తెలుగు గళం న్యూస్ స్టేషన్ ఘనపూర్, ఫిబ్రవరి 22: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఓపెన్ టెన్త్ మరియు ఇంటర్‌కు దరఖాస్తు చేసిన ప్రతి అభ్యాసకునికి ఓపెన్ స్కూల్ ద్వారా బేస్ లైన్ పరీక్షలు ఆదివారం నిర్వహించబడ్డాయి.ఓపెన్ స్కూల్‌లో ప్రవేశం పొందిన విద్యార్థులు తప్పనిసరిగా ఈ బేస్ లైన్ పరీక్షలు రాయాల్సి ఉంటుంది.జనగామ జిల్లాలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, స్టేషన్ ఘనపూర్ కేంద్రంగా మొబైల్ ద్వారా ఆన్‌లైన్ పద్ధతిలో టాస్ (తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ) బేస్ లైన్ పరీక్షలు నిర్వహించబడుతున్నాయి.ఈ పరీక్షలను జిల్లా ఉల్లాస్/టాస్ కోఆర్డినేటర్ మురళి శంకర్ రావు, పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు మిశ్ర గండ్ల సంపత్ కలిసి పరిశీలించారు.పరీక్షలు సజావుగా జరుగుతున్నందుకు వారు సంతోషం వ్యక్తం చేశారు.అలాగే ఏప్రిల్ 20వ తేదీ నుంచి ప్రారంభమయ్యే వార్షిక పరీక్షలకు విద్యార్థులు క్రమబద్ధంగా సిద్ధం కావాలని సూచించారు.ప్రధానోపాధ్యాయులు సంపత్ మాట్లాడుతూ, సెలవు రోజులలో నిర్వహించే ఓపెన్ స్కూల్ తరగతులకు హాజరవుతేనే పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించగలరని తెలిపారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఎం. కళ్యాణి, ఎం. మౌనవ్య, విద్యార్థులు మరియు ఇతరులు పాల్గొన్నారు.

## నేషనల్ హైవే పై పొంచి ఉన్న ప్రమాదం

### -అధికారుల నిర్లక్ష్యం



తెలుగు గళం న్యూస్ జనగామ: నేషనల్ హైవే 163 పరిధిలోని రఘునాథపల్లి మండల కేంద్రంలో ఆర్‌ఎస్వీ కాంప్లెక్స్ ముందు ప్రమాదకర పరిస్థితి నెలకొంది. కొన్ని నెలల క్రితం జాతీయ రహదారి సర్వీస్ రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన ఇనుప కంచె కూలిపోయినప్పటికీ ఇప్పటివరకు మరమ్మతులు చేపట్టలేదు.ఇనుప కంచె లేకపోవడంతో రహదారి పక్కనే లోతైన ప్రదేశం ఉండటం వల్ల ఎప్పుడైనా వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతోంది. ప్రజల నుంచి రహదారి సుంకం (టోల్ టాక్స్) వసూలు చేస్తున్నప్పటికీ, వారి భద్రతపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రయాణికులు మండిపడుతున్నారు.ఇప్పటికైనా సంబంధిత జాతీయ రహదారి అధికారులు వెంటనే స్పందించి కూలిపోయిన ఇనుప కంచెను పునర్నిర్మించి, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి, ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు మరియు వాహనదారులు కోరుతున్నారు.

## వరంగల్‌లో ఘనంగా ముస్లిహ్ మౌఊద్ దినోత్సవం సమావేశం



తెలుగు గళం న్యూస్ వరంగల్ ఫిబ్రవరి 22: వరంగల్ పట్టణ కేంద్రంలో అహ్మదీయ ముస్లిం కమ్యూనిటీ ఆధ్వర్యంలో ముస్లిహ్ మౌఊద్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి స్థానిక కమ్యూనిటీ అధ్యక్షుడు ముహమ్మద్ సలీం అధ్యక్షత వహించారు.కార్యక్రమం ఖురాన్ తిలావత్‌తో ప్రారంభమైంది.ముహమ్మద్ హమీద్ అహ్మద్ ఖురాన్‌లోని పలు సూక్తులను భావప్రధంగా పఠించారు. అనంతరం సయ్యద్ ముబారక్ అహ్మద్ ఉర్దూ పద్యాన్ని మధురమైన స్వరంతో చదివి సభికులను ఆకట్టుకున్నారు.తదుపరి స్థానిక మిషనరీ ఇంచార్జ్ మౌల్వీ ముహమ్మద్ అయాన్ పాషా ముస్లిహ్ మౌఊద్ దినోత్సవ ప్రాముఖ్యత, ప్రత్యేకతపై వివరంగా మాట్లాడారు. 1886 ఫిబ్రవరి 20న మిర్జా గులాం అహ్మద్ ఖాదియానీ (అలైహిస్సలాం)కి అల్లాహ్ తఆలా ప్రసాదించిన మహా ప్రవచనం నెరవేర్చబడిన సందర్భాన్ని ఆయన వివరించారు. ఆ ప్రవచనానికి ప్రతిరూపంగా నిలిచిన మిర్జా బషీరుద్దీన్ మహ్మూద్ అహ్మద్ (రజి.) సేవలను ఆయన ప్రస్తావించారు.అనంతరం జిల్లా యువజన సమితి అధ్యక్షుడు ముహమ్మద్ కబీర్ పాషా మాట్లాడుతూ, జమాత్ అహ్మదీయ్య స్థాపన ఉద్దేశం మరియు ముస్లిహ్ మౌఊద్ దినోత్సవ ఆధ్యాత్మిక నేపథ్యాన్ని వివరించారు. అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి మౌల్వీ సయ్యద్ కరీం ముస్లిహ్ మౌఊద్ ఇస్లాం ప్రచారం, జమాత్ విస్తరణలో చేసిన విశిష్ట సేవలను వివరించారు.సభా అధ్యక్షుడు ముహమ్మద్ సలీం తన అధ్యక్ష ప్రసంగంలో ముస్లిహ్ మౌఊద్ దేశానికి, సమాజానికి చేసిన సేవలను ప్రస్తావిస్తూ, యువత ఆయన ఆదర్శాలను అనుసరించాలని పిలుపునిచ్చారు.చివరిగా ప్రత్యేక ప్రార్థనతో కార్యక్రమం ముగిసింది. ఈ కార్యక్రమంలో మౌల్వీ ఉసామా ,అమ్జద్,హంజ,నజీమా రఫీ,రుబీనా కబీర్,మునీషా కరీం,గౌషియా అయాన్, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కుమ్మెర మల్లన్న జాతర ఘటనపై కఠిన చర్యలు తీసుకోవాలి

### -టిఆర్పి జిల్లా అధ్యక్షులు కౌటం రవి పటేల్

### బాధిత కుటుంబానికి సంపూర్ణ న్యాయం కల్పించాలి





తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి: కుమ్మెర మల్లన్న స్వామి జాతర సందర్భంగా రజక సంఘానికి చెందిన భక్తులపై జరిగిన దాడి తీవ్ర ఆవేదనకు గురిచేసిందని తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ పేర్కొన్నారు. ముఖ్యంగా ఈ ఘటనలో రెండు నెలల పసికందు ప్రాణాలు కోల్పోవడం అత్యంత దురదృష్టకరమని, సమాజాన్ని కలిచివేసే విషాదకర సంఘటనగా ఆయన అభివర్ణించారు.భక్తి విశ్వాసాలతో దేవాలయ దర్శనానికి వెళ్లిన వారిని కులం పేరుతో అవమానించడం, వారిపై దాడి జరగడం మానవత్వానికి మచ్చగా నిలిచిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటనలు సామాజిక సమగ్రతకు భంగం కలిగిస్తాయని, శాంతి--సౌహార్ద వాతావరణాన్ని దెబ్బతీస్తాయని పేర్కొన్నారు. ఘటనపై బాధ్యులైన అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించి దాడికి పాల్పడిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు మరియు వారికి పూర్తి రక్షణ కల్పించే వరకు తమ పార్టీ అండగా నిలుస్తుందని రవి పటేల్ తెలిపారు.అవసరమైన ఆర్థిక సహాయం, న్యాయ సహాయం అందించేందుకు కూడా పార్టీ సిద్ధంగా ఉందని చెప్పారు.ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా నిరోధక చర్యలు చేపట్టాలని, దేవాలయ ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లు బలోపేతం చేయాలని అధికారులను కోరారు.సమాజంలో ఏ వర్గానికైనా అన్యాయం జరిగినప్పుడు బాధితుల పక్షాన నిలబడటం తమ పార్టీ విధానమని ఆయన స్పష్టం చేశారు.బాధితులకు న్యాయం జరగకపోతే ప్రజాస్వామ్య పద్ధతుల్లో నిరసన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్నికల ప్రణయ్ రాజ్, వర్కింగ్ ప్రెసిడెంట్ కౌటం సురేందర్, జిల్లా కార్యదర్శి మోటాపోతుల సమ్మయ్య, జిల్లా నాయకులు ఏదునూరి స్వామి రజక తదితరులు పాల్గొన్నారు.

# భూపాలపల్లి మున్సిపాలిటీకి నూతన నాయకత్వం

### చైర్మన్‌గా బుర్ర కొమురయ్య,వైస్ చైర్మన్‌గా అంబాల శ్రీనివాస్ బాధ్యతల స్వీకారం

### ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే గండ్ర సత్తన్న



తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి: జయశంకర్ భూపాలపల్లి పట్టణాభివృద్ధికి కొత్త దిశను నిర్దేశించేలా మున్సిపాలిటీ నూతన చైర్మన్, వైస్ చైర్మన్ పదవి బాధ్యతల స్వీకరణ కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గండ్ర సత్యనారాయణ రావు సమక్షంలో బుర్ర కొమురయ్య చైర్మన్‌గా,అంబాల శ్రీనివాస్ వైస్ చైర్మన్‌గా అధికార బాధ్యతలు స్వీకరించారు.పట్టణ ప్రజలు, ప్రజాప్రతినిధులు,అధికారులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.కార్యక్రమానికి ముందు ప్రముఖులు భూపాలపల్లి హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం పట్టణ ప్రధాన వీధుల గుండా భారీ ర్యాలీ నిర్వహించి డా. బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ప్రజల ఆశీస్సులతో మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్న నాయకులు బాధ్యతల స్వీకరణ కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునే విధంగా నూతన నాయకత్వం పనిచేయాలని సూచించారు.పట్టణంలో మౌలిక వసతుల అభివృద్ధి, తాగునీటి సరఫరా వ్యవస్థ బలోపేతం,రహదారుల నిర్మాణం, పారిశుద్ధ్య నిర్వహణ, డ్రైనేజ్ వ్యవస్థ మెరుగుదల వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు.ప్రభుత్వం అందించే నిధులను పారదర్శకంగా వినియోగించి భూపాలపల్లిని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.ప్రజా సమస్యల పరిష్కారంలో వేగం, సమర్థత అత్యంత ముఖ్యమని ఆయన పేర్కొన్నారు.నూతన చైర్మన్ బుర్ర కొమురయ్య మాట్లాడుతూ, పట్టణ ప్రజల అభీష్టాలను గౌరవిస్తూ సమర్థవంతమైన పాలన అందించేందుకు కట్టుబడి ఉంటామని తెలిపారు.అభివృద్ధి పనుల్లో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచుతూ, ప్రతి వార్డు సమస్యలను ప్రాధాన్య క్రమంలో పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని చెప్పారు.వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్ కూడా సమిష్టి కృషితో మున్సిపాలిటీ అభివృద్ధిని వేగవంతం చేస్తామని,ప్రజా సేవే తమ ప్రధాన లక్ష్యమని వెల్లడించారు.ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బట్టు కరుణాకర్, ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాశ్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు, సీపీఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజుకుమార్ తదితర ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, సంబంధిత శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షుడు ఇస్లావత్ దేవన్,నూతన కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.పట్టణ అభివృద్ధికి సమిష్టి కృషి అవసరమని, ప్రజల విశ్వాసం నిలబెట్టుకుంటూ పారదర్శక పాలన అందిస్తామని నాయకులు హామీ ఇచ్చారు.



## ఆర్టీసీ బస్సులో దొంగల చేతివాటం...



తెలుగు గళం న్యూస్:ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ఓ మహిళ బ్యాగులో నుంచి బంగారం, వెండి నగలతోపాటు నగదును ఎత్తుకెళ్లిన ఘటన ఘట్కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బాధితుల కథనం ప్రకారం... చర్లపల్లికి చెందిన చింతల జనార్దన్ రెడ్డి భార్య పిల్లలతో కలిసి జనగామ జిల్లా పాలకుర్తిలోని శివాలయం వెళ్లేందుకు శనివారం మధ్యాహ్నం రాంపల్లిలో బస్సు ఎక్కి యంనంపేట చౌరస్తా వద్ద దిగారు. అక్కడ జనగామ డిపో బస్సు ఎక్కి కొద్ది దూరం వెళ్లిన తర్వాత జనార్దన్ రెడ్డి భార్య ఆధార్ కార్డు కోసం బ్యాగ్ తెరిచి చూడగా తెరిచి ఉండటం చూసి అవాక్కయింది. బ్యాగులోని సుమారు మూడున్నర తులాల బంగారు, పది తులాల వెండి అభరణాలతో పాటు రూ. 4 వేల నగదు చోరీ అయినట్లు గుర్తించింది. బస్సు ఎక్కేటప్పుడు దుండగులు చోరీకి పాల్పడ్డారని ఘట్కేసర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నారు. కాగా మూడున్నర తులాల బంగారు నగలు పోయాయని ఫిర్యాదు చేయడానికి వెళితే ఘట్కేసర్ పోలీసులు తులం బంగారం మాత్రమే చోరీకి గురైందని బలవంతంగా ఫిర్యాదులో రాయించారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. బంగారం ఎప్పుడు కొన్నారు ఎక్కడ ఉన్నారు రసీదులు ఉన్నాయా అని ప్రశ్నించి, తాము చెప్పినట్లుగానే ఫిర్యాదు రాయాలని ఒత్తిడి చేసినట్లు తెలిపారు.

## తాళం వేసిన ఇంట్లో రూ. 22 లక్షల చోరీ..



తెలుగు గళం న్యూస్, చౌటుప్పల్ : యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలో తాళం వేసి ఉన్న ఇంట్లో భారీ చోరీ ఘటన చోటుచేసుకుంది. బీరువాలో దాచి ఉంచిన రూ.22 లక్షల నగదు గుర్తుతెలియని దుండగులు అపహరించడంతో పట్టణంలో కలకలం రేగింది. చౌటుప్పల్ పోలీసుల కథనం ప్రకారం... చౌటుప్పల్ పట్టణానికి చెందిన లింగంపల్లి నరసింహ శనివారం ఉదయం తన భార్యతో కలిసి హైదరాబాద్‌లో ఇంటర్మీడియట్ చదువుతున్న తన కూతురు వద్దకు వెళ్లారు. అదే రోజు రాత్రి సుమారు 10 గంటల సమయంలో ఇంటికి తిరిగి వచ్చేసరికి ఇంటి తలుపు తెరిచి ఉండటం గమనించారు. అనుమానం వచ్చి లోపలికి వెళ్లి పరిశీలించగా.. బీరువాలో దాచి ఉంచిన రూ.22 లక్షల నగదు కనిపించలేదు.

సోమవారం ప్లాట్ రిజిస్ట్రేషన్ ఉండడంతో ఆ నగదును సిద్ధంగా ఉంచినట్లు బాధితుడు తెలిపారు. తన భార్య ఒంటిపై ఉన్న బంగారాన్ని మొత్తం బ్యాంకులో కుదువపెట్టి రుణం తీసుకున్నట్లు నరసింహ వెల్లడించారు. అదే నగదును దుండగులు ఎత్తుకెళ్లినట్లు వాపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్‌లను రంగంలోకి దించి ఆధారాలు సేకరించారు. పరిసర ప్రాంతాల్లో సీసీటీవీ కెమెరాల దృశ్యాలను పరిశీలిస్తున్నారు. స్థానిక పోలీస్ ఇన్స్పెక్టర్ జి. మన్మథకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇటీవల తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని చోరీలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.

